క్లుప్తంగా

పన్నులు చెల్లించి సహకరించండి

● జోన్‌–8 కమిషనర్‌ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీకి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, యూజర్‌ చార్జీలు, ట్రేడ్‌ లైసెన్స్‌ వంటివి సకాలంలో చెల్లించి సహకరించాలని జోన్‌–8 కమిషనర్‌ మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో కోరారు. 2022–23 ఏడాదికి గానూ ఈ నెల 31తో పన్నులు చెల్లింపు సమయం ముగియనుందన్నారు. ఈ లోగా బకాయిలు ఉన్నవారు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. జోన్‌–8 కార్యాలయంలో ఈ నెల రోజుల పాటు సౌకర్యం కౌంటర్‌ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, సెలవు దినాల్లో కూడా కౌంటర్‌ తెరిచి ఉంటుందన్నారు. జోన్‌ పరిధిలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ విజ్ఞప్తి చేశారు.

అప్పన్న సన్నిధిలో ఉన్నతాధికారులు



ఆలయ బేడామండపంలో ప్రదక్షిణ చేస్తున్న కరికల్‌ వలవన్‌, సృజన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌.కరికల్‌ వలవన్‌, ఏపీఐఐసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ జి.సృజన గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వీరి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్‌ అందజేశారు.

రహదారుల మరమ్మతులకు చర్యలు



రోడ్ల మరమ్మతులు చేపడుతున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

పరవాడ: మండలంలో అధ్వానంగా మారిన పలు రహదారుల మరమ్మతులకు ఆర్‌ అండ్‌ బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ ఆదేశాల మేరకు రోడ్డు భవనాల శాఖ అధికారులు గోతులమయంగా మారిన పరవాడ–బొట్టవానిపాలెం, పరవాడ సినిమాహాలు –పరవాడ, పరవాడ–విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ రహదారుల్లో పడిన గుంతలను మూడు రోజుల నుంచి పూడ్చే పనులు చేపట్టారు. ఊటగెడ్డ కూడలిలో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు పూర్తి చేశారు.

బీజేపీ సంబరాలు



బాణసంచా కాలుస్తున్న గొర్లె రామునాయుడు, నాయకులు

సింహాచలం: ఈశాన్య రాష్ట్రాల్లోని సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేయడంతో పెందుర్తిలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. నాగాలాండ్‌, త్రిపురల్లో బీజేపీ కూటమి విజయం సాధించడంతో విజయోత్సవాలు చేశారు. పెందుర్తి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో పార్టీ నాయకులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, పెందుర్తి రూరల్‌ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తీరంలో స్వచ్ఛభారత్‌

బీచ్‌ రోడ్డు: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని యువతీ యువకులు గురువారం సాగరతీరంలో స్వచ్ఛభారత్‌ కార్యక్రమం నిర్వహించారు. ఆర్కేబీచ్‌ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఉన్న చెత్తను సేకరించి జీవీఎంసీ సిబ్బందికి అప్పగించారు.

సీఎం జగన్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ గెలుపే లక్ష్యం
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌
- సుజాతనగర్‌లో కాల్‌ సెంటర్‌ ప్రారంభం



కాల్‌ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది



ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి కాల్‌సెంటర్‌ గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌

సింహాచలం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తెలిపారు. పెందుర్తి మండలం సుజాతనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన కాల్‌ సెంటర్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిల్చున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం కంకణం కట్టుకున్నారన్నారు. ఉత్తరాంధ్ర యువత జీవనోపాధి కోసం ఎంతో శ్రమిస్తున్నారని చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విశాఖను పరిపాలన రాజధానిగా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ పాటు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్రులు వైఎస్‌ జగన్‌ నిలబెట్టిన సీతంరాజు సుధాకర్‌ని ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు భరోసా కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించారన్నారు. పట్టభద్రులందరికీ అందుబాటులో ఉండేలా కాల్‌ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్‌ ముమ్మన దేముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆదాయ పన్నుల శాఖ కమిషనర్‌ బాలకృష్ణ

మద్దిలపాలెం: ఆదాయపు పన్ను విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఆదాయ పన్నుల శాఖ బాలకృష్ణ అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో గురువారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్‌ హాల్‌లో స్వచ్ఛంద సంస్థలు, దేవదాయ శాఖాధికారులు, విద్యార్థులతో అవగాహన, అవుట్‌ రీచ్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయ పన్నుల శాఖ కొన్ని వాటికి మినహాయింపు ఇచ్చిందన్నారు. నూతనంగా చట్టంలో వచ్చిన మార్పులను వివరించారు. పన్నుల రూపంలో సేకరించిన సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తారని చెప్పారు. పన్నుల చెల్లింపులు సకాలంలో జరగాలన్నారు. ఏయూ ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ నారాయణరావు, సీనియర్‌ చార్టెడ్‌ అకౌంటెంట్‌ యు.రామకృష్ణ ప్రసంగించారు. అనంతరం ఐటీ శాఖ అధికారులు నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్‌ జాయింట్‌ కమిషనర్‌ వి.కోటేశ్వరమ్మ, రమణమూర్తి, ఏఎస్‌ఎం రెడ్డి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



చినగదిలిలో ఆవుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం చినగదిలిలో పశు వైద్య సిబ్బంది పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. చినగదిలి ప్రాంతంలో 120 పశువులకు ఈ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాఖ చినగదిలి మండలం ఏడీ డాక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలల వయస్సు ఉన్న దూడ నుంచి పెద్ద పశువుల వరకు ఈ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

కళలతో సమాజంలో గుర్తింపు



బాలురు ప్రదర్శించిన నాటికను తిలకిస్తున్న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీనదయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్‌ ఆర్ట్స్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం నటనలో తర్ఫీదు పొందిన బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు. చెడు స్నేహంతో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురయ్యాయో అనే సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. శిక్షణ ఇచ్చిన అసోసియేషన్‌ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్‌ కె.వీరయ్య, అతిథులు తలసాని కృష్ణప్రసాద్‌, అబ్దుల్‌ అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్‌ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్‌ క్లైమేట్‌ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. మార్చి 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్‌ డే ఎడ్వెంటిస్ట్‌ స్కూల్‌, ఏఎస్‌ రాజా మహిళల జూనియర్‌ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి'నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భూమి మీద ఉన్న వన్యప్రాణులు, మొక్కలు భూమి మనుగడకు, మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఎలా కారణమవుతున్నాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సోషల్‌ వర్క్‌ విద్యార్థిని మెడగాస్కర్‌, ఏఎస్‌ రాజా కళాశాల ప్రిన్సిపాల్‌ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్‌ హెచ్‌ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

బాల్య వివాహాలు నేరం



ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: చిన్న వయసులోనే పిల్లలకు వివాహాలు చేయడం నేరమని 65వ వార్డు కార్పొరేటర్‌ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. 'బాల్యంలో పెళ్లిళ్లు – భావితరాలకు ఉరితాళ్లు' నినాదంతో వార్డు పరిధిలోని గిరిజా కాలనీ సామాజిక భవనంలో దళిత బహుజన రిసోర్స్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్‌ నిఖిల, కమ్యూనిటీ మొబిలైజర్‌ ధనలక్ష్మి, వెల్ఫేర్‌ సెక్రటరీ ఆనంద్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు మంగునాయుడు, దేముడు, పెంద్రరాజు, ప్రవీణ్‌, జాన సతీష్‌, ఆర్మీ సతీష్‌, వలంటీర్‌ జగదీష్‌ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధుల కోసం వినతి

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్‌ చింతకాయల ముత్యాలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ ఆధ్వర్యంలో గురువారం విశాఖలో టీటీడీ చైర్మన్‌ వై.వి.సుబ్బారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రామాలయ నిర్మాణంపై సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుపై చర్యలు చేపట్టాలని టీటీడీ దేవస్థానం ఈవోకు ఆదేశాలు జారీ చేశారని ముత్యాలు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గ్రామ ప్రజల తరపున ముత్యాలు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, సూరాడ సోమునాయుడు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్‌: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



పట్టభద్రులని కలిసి సీతంరాజు సుధాకర్‌కి ఓటు వేయాలని కోరుతున్న ఆదిరెడ్డి మురళి



పార్లుపాలెంలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ముమ్మన దేముడు



నాయుడుపాలెంలో ఓటర్లకు కరపత్రం అందిస్తున్న నాయకులు



పి.బోనంగిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పెందుర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం విస్తృత ప్రచారం చేశారు. 94వ వార్డు పరిధి ఆర్‌ఆర్‌ వెంకటాపురంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి ఓటర్ల ఇంటింటికి వెళ్లి సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తామర్ల నర్సింగ్‌, పిల్లా సురేష్‌, సచివాలయ కన్వీనర్లు గండేపల్లి ప్రసాద్‌, ఇలాపు నాగమణి, ముత్త అప్పలరాజు, ఆర్‌ఆర్‌ వెంకటాపురం గ్రామ ప్రెసిడెంట్‌ కోట్ని రామారావు పాల్గొన్నారు.

● సుధాకర్‌కు మద్దతుగా జీవీఎంసీ 95వ వార్డు పరిధి పార్లుపాలెంలో కార్పొరేటర్‌ ముమ్మన దేముడు ప్రచారం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాపర్తి మాధవరావు, ఆకుల గుణాకర్‌, మార్కెటింగ్‌ డైరెక్టర్‌ ఎ.ఎర్రయ్య, మింది రామునాయుడు, రాపర్తి కాశీ, ఆకుల నాయుడు పాల్గొన్నారు.

పరవాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్‌ కన్వీనర్‌ వెన్నల సన్యాసిరావు ప్రచారం చేశారు. నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పి.బోనంగి గ్రామాల్లో పర్యటించి సుధాకర్‌కు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.బోనంగి సర్పంచ్‌ బండారు కల్పన, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డెక్క శ్రీనివాసరావు, నాయుడుపాలెం సర్పంచ్‌ కూండ్రపు వరలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్‌ బి.కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

749వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్‌ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 749వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని ఎస్‌ఎంఎస్‌–1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి, ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమిస్తున్నట్లు రానున్న పార్లమెంట్‌ సమావేశాల్లో ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న కార్పొరేటర్‌ సురేష్‌

మల్కాపురం: ధ్యానం చేయడం ద్వారా ఎంతటి ఒత్తిడినైనా జయించవచ్చని 60వ వార్డు కార్పొరేటర్‌ పి.వి.సురేష్‌ అన్నారు. అహింస పిరమిడ్‌ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో భగవాన్‌ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో స్థానిక సన్‌రైజ్‌ పాఠశాలలో ఉచిత ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి 30 నిమిషాల పాటు దైవ ధ్యానం చేశారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి ఉన్న వారు నిత్యం ధ్యానం చేస్తే మంచిదన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఏయూ సమాచారమ్‌

మహిళా దినోత్సవం పోస్టర్‌ ఆవిష్కరణ



మహిళా దినోత్సవ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్‌: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వర్సిటీ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తెలుగు విభాగాధిపతి అప్పారావు మాట్లాడుతూ వర్సిటీ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించే ఈ వేడుకలో విశిష్ట మహిళలను సన్మానిస్తామన్నారు.

● మర్యాదపూర్వక కలయిక







గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌లో పాల్గొనేందుకు గురువారం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మహిళా కమిషన్‌ సభ్యురాలు గెద్దం ఉమ మర్యాదపూర్వకంగా కలిశారు. రాడిసన్‌ బ్లూ హోటల్‌లో ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛం అందించి, స్వాగతించారు.

సింహగిరీశుని దర్శించుకున్న రాష్ట్ర మంత్రులు





కప్పస్తంభానికి మొక్కుకుంటున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌ రెడ్డి దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పలువురు రాష్ట్ర మంత్రులు గురువారం దర్శించుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

● అప్పన్న స్వామికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అలంకారి పురోహిత్‌ కరి సీతారామాచార్యులు తదితరులు ఈ సేవ నిర్వహించారు.